సాక్షి
ఖమ్మం
శుక్రవారం ı 18 ı ఏప్రిల్ ı 2025



ట్రాఫిక్ స్టేషన్ ఇంకొకటి..
జిల్లా కేంద్రంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా త్వరలో రెండో ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ మంజూరు చేయనున్నారు. 10లో



గుట్టను మింగేస్తున్నారు..
సత్తుపల్లి మండలం బేతుపల్లి సమీపాన కొనాయిగూడెం గుట్ట పైనుంచి అక్రమంగా మట్టి తవ్వి వాహనాల్లో తరలిస్తున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
41° / 26°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నంకల్లా ఉష్ణోగ్రత పెరిగి వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం ఖమ్మం కార్పొరేషన్‌ పరిధి 16వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేస్తారు. ఇక శనివారం ఉదయం రఘునాథపాలెం మండలం మంచుకొండలో రైతుబజార్‌ నిర్మాణానికి, ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌లో మౌలిక వసతుల కల్పనకు శంకుస్థాపన చేయనున్నారు. ఆతర్వాత బూడిదంపాడులో బీటీ రోడ్డు నిర్మాణం, మెయిన్‌రోడ్డు విస్తరణ, ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు, సీసీ డ్రెయిన్‌ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు.

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: గుడ్‌ ఫ్రైడే, వారాంతం నేపథ్యాన శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం గుడ్‌ ఫ్రైడే, శని, ఆది వారాంతపు సెలవులు ఉంటాయని మార్కెట్‌ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. తిరిగి సోమవారం నుంచి మార్కెట్‌లో లావాదేవీలు మొదలవుతాయనే విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

ఏసీ బస్సులను సద్వినియోగం చేసుకోండి



టైర్ల నాణ్యతపై సూచనలు చేస్తున్న ఆర్‌ఎం

సత్తుపల్లిటౌన్‌: సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు ఆరు రాజధాని ఏసీ బస్సులు నడిపిస్తున్న నేపథ్యాన ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఖమ్మం రీజినల్‌ మేనేజర్‌ సరిరాం సూచించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోను గురువారం తనిఖీ చేసిన ఆయన గ్యారేజీ, ఇతర విభాగాల్లో పరిశీలించడమే కాక టైర్ల నాణ్యతపై సూచనలు చేశారు. సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు పగలు, రాత్రి మూడు చొప్పున ఆరు ఏసీ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కాగా, మహిళా సమాఖ్యల ద్వారా ఖమ్మం రీజియన్‌కు 21 పల్లెవెలుగు బస్సులు వచ్చాయని ఆర్‌ఎం చెప్పారు. అనంతరం బస్టాండ్‌ను పరిశీలించే క్రమాన ప్రయాణికులు ఎండలో ఉండడంతో, వారంలోగా అదనపు ప్లాట్‌ఫామ్‌ ఏర్పాటుచేయాలని ఇంజనీరింగ్‌ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఆతర్వాత బస్టాండ్‌లో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన ఉచిత మజ్జిగ పంపిణీని ఆర్‌ఎం ప్రారంభించారు. డిపో మేనేజర్‌ యు.రాజ్యలక్ష్మి, సీఐ విజయశ్రీ, ఎంఎఫ్‌ ఎస్‌.సాహితి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య

ఖమ్మంవ్యవసాయం: రానున్న వానాకాలం సీజన్‌లో సాగుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏఓ) ధనసరి పుల్లయ్య సూచించారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన విత్తనాలు, ఎరువుల డిస్ట్రిబ్యూటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది డిమాండ్‌ ఆధారంగా పత్తి, మిరప, ఇతర వాణిజ్య పంటల విత్తనాలను అందుబాటులో ఉంచాలని, కొరత ఏర్పడకుండా ముందుగానే కంపెనీలతో చర్చించాలని తెలిపారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించాలని యత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఖమ్మం డివిజన్‌ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, వాసవీరాణి, సరిత, ఏఓలు కిషోర్‌బాబు, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు రూ.3 కోట్ల చెల్లింపులు

నేలకొండపల్లి: జిల్లాలో 350 కేంద్రాల నుంచి ఇప్పటి వరకు 6,481 మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కె.చందన్‌కుమార్‌ తెలిపారు. మండలంలోని రాజేశ్వరపురం రైస్‌ మిల్లును గురువారం తనిఖీ చేసిన ఆయన నిల్వలను పరిశీలించాక మాట్లాడారు. ఇప్పటివరకు రూ.15 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, రైతులకు రూ.3కోట్ల మేర నగదు జమ చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపడుతూనే ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. మిల్లర్లు ఇబ్బంది పెట్టకుండా పర్యవేక్షిస్తున్నామని, రైతులకు సమస్య ఎదురైతే ఫిర్యాదు చేయాలని సూచించారు. సివిల్‌ సప్లయీస్‌ ఆర్‌ఐ నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల చిక్కులకు బై..బై

భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్‌(రికార్డ్‌ ఆఫ్‌ రైట్స్‌) చట్టంతో జిల్లాలో ఐదేళ్లుగా పెండింగ్‌ ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుంది. కొత్త చట్టంలో ఇందుకోసం ప్రత్యేకంగా నిబంధనలు ఉండడంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పరిశీలనకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాలో సాదాబైనామాల కోసం 1,11,443 మంది సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇవి పెండింగ్‌ ఉండడంతో తమ భూమిపై ఎప్పుడు హక్కులు దక్కుతాయోనని ఇన్నాళ్లు ఎదురుచూపులతో గడుపుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



'భూభారతి'తో సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం
- జిల్లాలో 1.11.443 మంది రైతుల ఎదురుచూపులు
- కొత్త చట్టంలో ఇందుకోసం ప్రత్యేక నిబంధన
- విధివిధానాలు జారీ కాగానే పరిశీలన, పరిష్కారం

దరఖాస్తులతోనే సరి

తెల్లకాగితాలపై జరిగిన భూలావాదేవీలను క్రమబద్ధీకరించాలని 2016లో నాటి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లోనే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. 2020 అక్టోబర్‌లో ప్రభుత్వం 112 జీఓ ద్వారా మరోసారి దరఖాస్తులను ఆహ్వానించి రెండు దఫాలుగా నవంబర్‌ 10వరకు అవకాశం కల్పించింది. దీంతో రైతులు మీ సేవ కేంద్రాల్లో ఫారం 10 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ తర్వాత అమల్లోకి వచ్చిన ధరణి చట్టంలో సాదా బైనామాల క్రమబద్ధీకరణకు ఎలాంటి అవకాశం లేకపోగా.. హైకోర్టు స్టే విధించడంతో గత ప్రభుత్వం దరఖాస్తులను పక్కన పెట్టింది.

కొత్త చట్టంతో అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్‌ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో ప్రత్యేకంగా సెక్షన్‌ 6, రూల్‌ 6లో నిబంధనలు పొందుపర్చిన నేపథ్యాన దరఖాస్తులకు ఏళ్ల తర్వాత మోక్షం కలగనుంది. అయితే, ప్రభుత్వం షెడ్యూల్‌ ప్రకటించి.. తద్వారా దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టనున్నారు. రాతపూర్వక ఆధారాలు పరిశీలించడమే కాక పీఓటీ, సీలింగ్‌, ఎల్‌టీఆర్‌ చట్టాల ఉల్లంఘన జరగలేదని నిర్ధారించుకుంటారు.

చిగురిస్తున్న ఆశలు

తెల్లకాగితాలపై క్రయవిక్రయాలు చేసుకున్న భూములను క్రమబద్ధీకరిస్తామనే గత ప్రభుత్వ ప్రకటనతో రైతులు సంతోషించారు. కానీ ధరణి చట్టంలో అందుకు అవసరమైన నిబంధనలు లేక దరఖాస్తులు స్వీకరించాక ప్రక్రియ నిలిచిపోయింది. ఫలితంగా భూములపై హక్కులు దక్కక.. క్రయవిక్రయాలు జరగక, రుణాలు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నారు. అలాగే గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు కూడా ఈ రైతులకు దక్కలేదు. ప్రస్తుతం భూ భారతి చట్టం ద్వారా ఈ అవకాశం లభిస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎదురుచూపులకు తొమ్మిదేళ్లు..



కొణిజర్ల మండలం సింగరాయపాలెంకు చెందిన రాగం లక్ష్మయ్య లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. చాలీచాలని సంపాదనలలోనే కొంత జమ చేసి బంధువుల వద్ద 25 గుంటల భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్‌ కోసం బైనామా కాగితాలతో 2016లో కొణిజర్ల తహసీల్‌లో దరఖాస్తు చేస్తే ఈ అవకాశం లభించలేదు. ధరణి సైట్‌లో ఆ వెసులుబాటు లేదని అధికారులు బదులిచ్చారు. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా కొద్దిపాటి భూమి రిజిస్ట్రేషన్‌ కోసం లక్ష్మయ్య ఎదురుచూస్తున్నాడు. ప్రస్తుతం భూ భారతితో భూమిపై హక్కు వస్తుందని తెలియడంతో ఆనందం వ్యక్తం చేశాడు.

ఈ దరఖాస్తులకు అర్హత

సాదా బైనామా దరఖాస్తుల పరిశీలన ఆర్డీఓల నేతృత్వాన జరుగుతుంది. రైతులు 2014 జూన్‌ 2వ తేదీకన్నా ముందు గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ భూమిని సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసి ఉండాలి. అలాగే ఈ తేదీకి పన్నెండేళ్ల ముందు భూమి అనుభవంలో ఉన్నట్లు చూపాలి. అంతేకాక 2020 అక్టోబర్‌ 12 – నవంబర్‌ 10వ తేదీ మధ్య క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని ఉండాలి. ఆపై దరఖాస్తు చేసింది ఎవరు.. అనుభవంలో ఎవరు ఉన్నారో ఆర్డీఓలు విచారించి అర్హులైన రైతుల నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్‌, స్టాంపు డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్‌ జారీ చేస్తారు. ఆపై రికార్డుల్లో నమోదు చేశాక కొత్త పట్టాదారు పాసు పుస్తకం అందిస్తారు.

జిల్లాలో అత్యధిక దరఖాస్తులు వచ్చిన మండలాలు	పెనుబల్లి	కల్లూరు	కొణిజర్ల	తిరుమలాయపాలెం	కూసుమంచి	వేంసూరు	సింగరేణి	ఏన్కూరు
	14,333	8,314	7,846	7,607	7,193	6,791	6,681	6,179

రైతుల భూములకు భరోసా

- సమస్యల సత్వర పరిష్కారానికే 'భూ భారతి'
- అవగాహన సదస్సులో ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ శ్రీజ

నేలకొండపల్లి: రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి భరోసా కల్పించేందుకే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ తెలిపారు. చట్టంపై అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనుండగా.. తొలిరోజు నేలకొండపల్లిలో గురువారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో లేని అనేక అంశాలను కొత్త చట్టంలో చేర్చినందున సమస్యల పరిష్కారం సులువవుతుందని తెలిపారు. ఈ మేరకు రైతులు ఎప్పటిలాగే మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. ఏటా డిసెంబర్‌ 31న రికార్డులను అప్‌డేట్‌ చేయనుండడంతో బ్యాంకులకు వెళ్లినప్పుడు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన పనిలేకుండా పోర్టల్‌లోని వివరాల ఆధారంగా రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ పోర్టల్‌ అమలులో లోటుపాట్లను గుర్తించేందుకు నేలకొండపల్లి మండలాన్ని పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసినందున అందరూ అవగాహన పెంచుకుని సహకరించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్‌ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడగా... పలువురు రైతులు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, రెవెన్యూ డివిజనల్‌ అధికారి నరసింహారావు, మార్కెట్‌ చైర్మన్‌ వెన్నపూసల సీతారాములుతో పాటు శాఖమూరి రమేష్‌, భద్రయ్య, యడవల్లి సైదులు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కడియాల నరేష్‌, గుండా బ్రహ్మం, మేకల వెంకటేశ్వర్లు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, చిలకబత్తిని వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ శ్రీజ, పక్కన అదనపు కలెక్టర్‌ శ్రీనివాసరెడ్డి, అధికారులు



సందేహాలను నివృత్తి చేసుకుంటున్న రైతులు

నాచేపల్లిలో 112 దరఖాస్తులు

భూ భారతి చట్టం అమలుకు నేలకొండపల్లి మండలాన్ని పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యాన రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు ప్రారంభించారు. తొలిరోజు నాచేపల్లిలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన సదస్సును ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ ప్రారంభించి కొత్త చట్టంతో ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన రైతులు పలు సమస్యలపై 112 దరఖాస్తులు అందించారు. ఇందులో సాదాబైనామా క్రమబద్ధీకరణ కోసం 36, పట్టా ప్రకారం భూమి తరుగు ఉందని 33 మంది దరఖాస్తు చేయగా, మిగతావి పేరు మార్పిడి, నంబర్లలో తప్పులు, కొత్త పాసుపుస్తకాల కోసం అందాయి. అదనపు కలెక్టర్‌ శ్రీనివాసరెడ్డి, స్పెషల్‌ ఆఫీసర్‌ రాజేశ్వరి, ఆర్‌డీఓ నరసింహారావు, తహసీల్దార్‌ వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణలో ముందడుగు

- మున్నేరు రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణంలో పురోగతి
- నిర్వాసితులకు భూమికి బదులు భూమి ఇచ్చేలా నిర్ణయం
- 80శాతానికి పైగా నిర్వాసితుల అంగీకారం

ఖమ్మంఅర్బన్‌: మున్నేరు నది ముంపు నుంచి పరీవాహక ప్రాంత ప్రజలను రక్షించేందుకు గాను ఇరువైపులా రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే, ఇందుకు అడ్డంకిగా మారిన ప్రైవేట్‌ భూముల సమస్యకు పరిష్కార మార్గం లభించినట్లు తెలిసింది. ఖమ్మం నియోజకవర్గంతో పాటు పాలేరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, కాలనీలు మున్నేటి వరద ప్రవాహంతో ఏటా ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఇళ్లు మునిగిపోతుండగా, బాధితులు సర్వం కోల్పోతున్నారు. గత ఏడాది అసాధారణ రీతిలో వరద రావడంతో రూ.కోట్లలో నష్టం నమోదైంది. దీంతో సమస్య శాశ్వత పరిష్కారానికి గాను ప్రభుత్వం మున్నేటికి ఇరువైపులా 16 కిలోమీటర్ల మేర రిటైనింగ్‌ వాల్స్‌ నిర్మాణానికి రూ.690 కోట్లు కేటాయించింది. అయితే, ప్రభుత్వ భూమిలో నిర్మాణ పనులు కొద్దినెలలుగా జరుగుతున్నప్పటికీ ప్రైవేట్‌ స్థలాలు, ఇళ్లు, వ్యవసాయ భూముల విషయమై పరిహారం తేలకపోవడంతో జాప్యం జరిగింది. కాగా, పలుమార్లు మంత్రులు, కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌, రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు నిర్వాసితులతో చర్చించి వరదతో ఎదురయ్యే నష్టాన్ని వివరించగా.. భూములు ఇచ్చేందుకు వారు అంగీకరించినట్లు సమాచారం.



రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశంలో పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్‌)

పోలేపల్లి వద్ద లే ఔట్‌

మున్నేరు పరీవాహకంలో ఇళ్లు, స్థలాలు, పొలాలు ఉన్న వారు తమ భూములను రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణానికి అప్పగిస్తే పోలేపల్లిలో డీటీసీ లేఔట్‌ చేసి స్థలాలు కేటాయించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు ఒప్పించినట్లు సమాచారం. ఈమేరకు నిర్వాసితులు 80శాతం మందికి పైగా తమ భూములు, ప్లాట్లు ఇవ్వడానికి అంగీకారపత్రాలు అందజేసినట్లు తెలిసింది. అయితే, ఇంటి స్థలం కోల్పోతే అంతే స్థలాన్ని పోలేపల్లి వద్ద చేసే లే ఔట్‌లో కేటాయిస్తారు. అలాగే, భూములు కోల్పోతే ఎకరాకు 600 – 750 గజాల స్థలం ఇచ్చేలా నిర్ణయించినట్లు సమాచారం. ఏటా ముంపు భయంతో ఉండేబదులు మున్నేటికి దూరంగా లే ఔట్‌ చేసే స్థలంలో ఉంటే మంచిదనే భావనతో పరీవాహక ప్రాంత ప్రజలు ముందుకొచ్చినట్లు తెలుస్తుండగా.. రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణానికి మార్గం సుగమైనట్లేనని భావిస్తున్నారు.

మార్కింగ్‌ కూడా...

రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణానికి సేకరించాల్సిన భూమిని పలు దఫాలుగా పరిశీలించిన వివిధ శాఖల అధికారులు మార్కింగ్‌ కూడా చేశారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని మల్లెమడుగు, దానవాయిగూడెం, బురాన్‌పురం, ఖమ్మం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూములు, వెంచర్లు, ప్లాట్లు, ఇండ్లు కలిపి మొత్తం సుమారు 67ఎకరాలు సేకరించనున్నట్లు తెలిసింది. ఇందులో 28 ఎకరాల పరిధిలో ప్లాట్లు ఉన్నాయి. ఇక పాలేరు నియోజకవర్గ పరిధి పోలేపల్లి, ఏదులాపురం, రెడ్డిపల్లి, గుదిమళ్ల తదితర ప్రాంతాల్లో సుమారు 74ఎకరాలకు పైగా స్థలాన్ని గుర్తించారు. ఇప్పటికే నిర్వాసితులకు నోటీసులు ఇవ్వడమే కాక వారి నుంచి అంగీకారపత్రాలు సైతం తీసుకుంటున్నారు. ఈమేరకు 80శాతానికి పైగా మంది అంగీకార పత్రాలు అందించినట్లు రెవెన్యూ అధికారుల ద్వారా తెలిసింది. అయితే, బొక్కలగడ్డ, మోతీనగర్‌ ప్రాంతాల బాధితులు మాత్రం తమ ఇంటి స్థలం కేటాయించడమే కాక ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. ఈ విషయంలో ఇంకా స్పష్టత రాకున్నా అత్యధిక శాతం మంది భూములు, స్థలాలు ఇవ్వడానికి అంగీరించిన నేపథ్యాన మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణంలో ఇక్కట్లు తొలగినట్లేనని యంత్రాంగం చెబుతోంది.

ఆ ఆస్పత్రులు సీజ్‌ చేయండి

- జిల్లాలోని పది ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ రద్దు చేయాలని ఆదేశం
- సీఎంఆర్‌ఎఫ్‌ గోల్‌మాల్‌ తేలడంతో డీహెచ్‌ ఉత్తర్వులు



ఖమ్మంవైద్యవిభాగం: చికిత్స చేయించుకోకున్నా నకిలీ బిల్లులు సృష్టించి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్‌) నిధులు కాజేసిన వ్యవహారంలో జిల్లాలోని పది ఆస్పత్రులపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. ఇప్పటికే అక్రమాలు బయటపడిన పది ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని హెల్త్‌ డైరెక్టర్‌ నుండి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశాలు జారీ అయ్యాయి.

ఏమిటీ అక్రమాలు?

అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటే ప్రజాప్రతినిధుల సిఫారసుతో సీఎంఆర్‌ఎఫ్‌ ద్వారా నిధులు విడుదల చేస్తారు. అయితే ఈ నిధులను అక్రమ మార్గంలో కాజేయాలని ఖమ్మంలోని కొందరు ఆస్పత్రుల నిర్వాహకులు ప్రణాళిక వేశారు. ఇందులో భాగంగా చికిత్స చేయించుకోని వారి పేర్లతో నకిలీ మెడికల్‌ బిల్లులు సృష్టించి సమర్పించగా.. విషయం తెలియని ప్రజాప్రతినిధులు సిఫారసు చేశారు. దీంతో విడుదలైన రూ.లక్షల్లో నగదును ఆస్పత్రుల నిర్వాహకులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై కొద్దినెలల క్రితం సీఎంఓ ద్వారా అందిన ఫిర్యాదుతో విజిలెన్స్‌ అధికారులు విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖమ్మంలోని ఆస్పత్రుల్లోనూ హైదరాబాద్‌ అధికారులు అప్పట్లో విచారణ చేశారు. ఈక్రమాన ఆస్పత్రుల్లో నకిలీ బిల్లులు సృష్టించి సీఎంఆర్‌ఎఫ్‌ నిధులు కాజేసినట్లు తేలగా హెల్త్‌ డైరెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ఖమ్మం నెహ్రూ నగర్‌లోని శ్రీ వినాయక ఆస్పత్రి, గ్లోబల్‌ ఆస్పత్రి, జేఆర్‌.ప్రసాద్‌ ఆస్పత్రి, శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌, సాయి మల్టీ స్పెషాలిటీ, వైష్ణవి ఆస్పత్రి, సుజాత హాస్పిటల్‌, ఆరెంజ్‌ హాస్పిటల్‌, న్యూ అమృత ఆస్పత్రితో పాటు మేఘశ్రీ హాస్పిటల్‌ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశాలు అందాయి.

ఔను నిజమే...

ఖమ్మంలోని పది ఆస్పత్రల గుర్తింపు రద్దు చేయాలన్న ఆదేశాలపై డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కళావతి బాయిని వివరణ కోరగా వాస్తవమేనని ధ్రువీకరించారు. విజిలెన్స్‌ అధికారుల నివేదిక ప్రకారం హెల్త్‌ డైరెక్టర్‌ ఆయా ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ రద్దు చేయాలని ఆదేశాలు అందాయని తెలిపారు. ఈమేరకు ఆస్పత్రుల యాజమాన్యాలకు ఉత్తర్వుల కాపీలు పంపించి, మూసివేయాలని సూచించినట్లు వెల్లడించారు.

హీమోఫిలియాపై విస్తృత అవగాహన



మాట్లాడుతున్న జిల్లా మాస్‌ మీడియా అధికారి సుబ్రహ్మణ్యం

ఖమ్మంవైద్యవిభాగం: హీమోఫిలియా వ్యాధి జన్యుపరంగా వచ్చే రక్తస్రావ రుగ్మత అని.. ఈ వ్యాధి లక్షణాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని జిల్లా మాస్‌ మీడియా అధికారి సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ప్రపంచ హీమోఫిలియా దినోత్సవం సందర్భంగా గురువారం మామిళ్లగూడెం యూపీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధి రక్తం గడ్డకట్టే సామర్థ్యంపై ప్రభావాన్ని చూపుతుందని, తద్వారా గాయమైతే ఎక్కువగా రక్తస్రావం అవుతుందన్నారు. ఇలాంటి పరిస్థితులను గుర్తిస్తే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. కాగా, వ్యాధి గుర్తింపు, చికిత్సపై వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన తెలిపారు. ఆతర్వాత అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ కృష్ణచైతన్య, హెల్త్‌ ఎడుకేటర్‌ అన్వర్‌, తదితరులు పాల్గొన్నారు.

పనులు అంతంత మాత్రమే..

- 'ఉపాధి' కల్పనపై దృష్టి సారించని అధికారులు
- గతేడాదితో పోలిస్తే సగం మందికీ దక్కని కూలీ
- జిల్లా నుంచి 53.15 లక్షల పనిదినాలు ప్రతిపాదన..
- 30.76 లక్షల పనిదినాలకే కేంద్ర లక్ష్యం



పాన్నెకల్‌లో ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలు

ఖమ్మంమయూరిసెంటర్‌: వ్యవసాయ సీజన్‌ చివరకు చేరడంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర పనులు తగ్గిపోతున్నాయి. ఈనేపథ్యాన కూలీలకు ఉపాధి హామీ పథకం వరంలా అండగా నిలవాలి. తద్వారా కూలీలకు ఉపాధి లభించి ఆర్థికంగా ఆసరా అవుతుంది. ఈక్రమంలోనే జిల్లాలో కొన్నేళ్ల క్రితం వరకు ఉపాధి కూలీలకు వెళ్లే వారి సంఖ్య లక్షల్లోనే ఉండగా.. ఏప్రిల్‌ నెల మొదటి వారం నుండే జాతరలా పనులు సాగేవి. కానీ ఈ ఏడాది మాత్రం కూలీలకు పనుల కల్పన నామమాత్రంగానే ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఏప్రిల్‌ సగం మేర గడిచినిపోయినా కనీస పనిదినాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని చెబుతున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు, కూలీల వివరాలు

జాబ్‌ కార్డులు	3.06 లక్షలు
కూలీలు	6.43 లక్షలు
యాక్టివ్‌ జాబ్‌కార్డులు	1.83 లక్షలు
యాక్టివ్‌ కూలీలు	3.08 లక్షలు

తగ్గిన పనిదినాలు

ఏటా ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య ఆధారంగా అధికారులు ఈ ఏడాది ఎన్ని పనిదినాలు అవసరమో ప్రణాళిక రూపొందిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో 53.15లక్షల పనిదినాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన వాటా ప్రకారం జిల్లాకు 30.76 లక్షల పనిదినాలనే లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం యూనిట్‌గా పనిదినాల సంఖ్య పెంచితే అదే స్థాయిలో జిల్లాకూ లబ్ధి జరగనుంది.

పనుల కల్పనలో అలసత్వం

జిల్లాలో కూలీలకు ఉపాధి పనుల కల్పనపై అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నెల అయిన ఏప్రిల్‌లో పనులకు వచ్చే కూలీల సంఖ్య తక్కువగా ఉండడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గతేడాది ఏప్రిల్‌ 11వ తేదీన 40,836 మంది కూలీలకు పని చూపించగా.. ఈ ఏడాది 11న 28,410 మందికే పనులు కల్పించడం గమనార్హం. ఇక గతేడాది ఏప్రిల్‌ 12న 80,734 మంది హాజరైతే, ఈ ఏప్రిల్‌ 12న 19,094 మంది మాత్రమే పనులకు హాజరయ్యారు. కాగా, ఏప్రిల్‌లో 9,96,307 పని దినాలు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 1.35 లక్షల పని దినాలు కల్పించడంతో కూలీలకు నష్టం ఎదురవుతోంది. గ్రామాల్లో రోజుకు 60వేల మందికి సరిపడా పనులు ఉన్నా అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది.

క్లుప్తంగా

20న జిల్లాస్థాయి చెస్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: ఈ నెల 20న జిల్లాస్థాయి చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఖమ్మంలోని సర్వజ్ఞ స్కూల్‌లో అండర్–10, 13, 16 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయని వెల్లడించారు. స్విస్ లీగ్ పద్ధతిలో జరిగే పోటీలకు హాజరుకావాలనుకునే వారు ఆర్గనైజర్ సీహెచ్.గోపి (94401 62749)ని సంప్రదించాలని సూచించారు.

జాబ్‌మేళాలో 17 మంది ఎంపిక

ఖమ్మంరాపర్తినగర్: రిలయన్స్ నిప్పాన్ కంపెనీలో ఉద్యోగాలకు గురువారం ఖమ్మంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 48 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం వీరిలో 17 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు.

ఏఐకేఎస్ జాతీయ కార్యవర్గంలో నలుగురికి స్థానం



బాగం హేమంతరావు విశ్వనాథం గోవిందరావు

ఖమ్మం మయూరిసెంటర్/పాల్వంచ/చింతకాని: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎంఎస్) జాతీయ సమితిలో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి స్థానం లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో గురువారం ముగిసిన జాతీయ మహాసభల్లో 36 మందితో జాతీయ కార్యవర్గం, 115 మందితో జాతీయ కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన బాగం హేమంతరావు జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అలాగే, భద్రాద్రి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, చింతకాని మండలం రాఘవాపురానికి చెందిన కొండపర్తి గోవిందరావుతో పాటు మందడపు రాణికి జాతీయ కౌన్సిల్‌లో సభ్యులుగా స్థానం దక్కింది. నేలకొండపల్లి మండలం ముటాపురానికి చెందని హేమంతరావు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, సీపీఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేయడంతో ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాగా, గోవిందరావు 1991లో సీపీఐలో కొనసాగుతుండగా వివిధ హోదాల్లో పనిచేయడమే కాక రాఘవాపురం సర్పంచ్‌గా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఈమేరకు వీరిని పలువురు అభినందించారు.

అందుబాటులో తపాలా బీమా పథకాలు



బీమా చెక్కు అందజేస్తున్న సూపరింటెండెంట్

కూసుమంచి: పోస్టల్ శాఖ ద్వారా అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి కోరారు. మండలంలోని రాజుపేటకు చెందిన భూక్యా చిరంజీవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన బీమా చేయించి ఉన్న నేపథ్యాన రూ.10 లక్షల పరిహారం మంజూరైంది. ఈ మేరకు చిరంజీవి కుటుంబానికి బీమా చెక్కు అందజేశాక సూపరింటెండెంట్ మాట్లాడారు. పోస్టల్ శాఖ ద్వారా ఏటా రూ.520 ప్రీమియంతో రూ.10 లక్షలు, రూ.749తో రూ.15 లక్షల బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోస్టల్ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్, మాజీ సర్పంచ్ కందాల సురేందర్‌రెడ్డితో పాటు జగదీశ్, పెరుగు నాగేశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ కలెక్టర్ తనిఖీ

ముదిగొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ గురువారం తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకానికి అందిన దరఖాస్తులు, వాటి పరిశీలనపై ఎంపీడీఓ శ్రీధర్‌స్వామితో సమీక్షించారు. ఏ యూనిట్ కోసం దరఖాస్తు అందిందో నమోదు చేయాలని, రెండింటి కోసం దరఖాస్తు చేస్తే 'డబుల్'అని రాయాలని సూచించారు. అలాగే, భూభారతి చట్టంపై నిర్వహించే అవగాహన సదస్సు ఏర్పాట్లపై తహసీల్దార్ సునీత ఎలిజబెత్‌తో చర్చించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	5,000
కందులు	6,800	3,000
మిర్చి	13,400	6,000
మిర్చి తాలు	5,500	4,200
పత్తి	7,350	5,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.21,000

గుట్టను మింగేస్తున్నారు..

- సత్తుపల్లిలో జోరుగా మట్టి దందా
- జరిమానాలతో వెనక్కి తగ్గని అక్రమార్కులు



కోనాయిగూడెం గుట్ట వద్ద తవ్వకాలు చేపడుతున్న జేసీబీలు

సత్తుపల్లి: సత్తుపల్లిలో మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మట్టి విక్రయాలతో రూ.లక్షలు చేతులు మారుతున్నాయంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాక ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగేందుకు వెనుకాడటం లేదని స్థానికులు చెబుతున్నారు. మరోపక్క అధికారులకు సైతం కాసులు కురిపిస్తుండడంతో ఖమ్మం నుంచి టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు వస్తే తప్ప స్థానిక ఉద్యోగులు తనిఖీల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని బేతుపల్లి సర్వే నంబర్ 133లో భూమిపై వివాదం నడుస్తోంది. ఇక్కడ సుమారు 100 ఎకరాల్లో ఉన్న కోనాయిగూడెం గుట్ట వద్ద పలువురు రాత్రింబవళ్లు జేసీబీలతో తవ్వుతూ వందలాది వాహనాలతో మట్టి తరలిస్తున్నారు. ఎవరైనా అడిగితే మైనింగ్ అనుమతులు ఉన్నాయని దాటవేస్తుండగా, వాహనాల రాకపోకలతో కంటిమీద కునుకు ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల నిర్మాణం, రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టి అవసరం కావడంతో.. ఇద్దరు, ముగ్గురు చేతుల్లోనే మట్టి మాఫియా ఉండటంతో ఇష్టారాజ్యంగా ధరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. టిప్పర్ మట్టి ధర గతేడాదితో పోలిస్తే రెండింతలు పెరిగిందని.. ఇదేమని ప్రశ్నిస్తే ఉద్యోగుల చేయి తడపాల్సి వస్తోందని బహిరంగంగానే చెబుతుండడం గమనార్హం.

పట్టుబడినా ఆగడం లేదు..

మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్న వారి జాబితా అధికారుల వద్ద ఉందని సమాచారం. అయినా తనిఖీల మాటెత్తకపోగా, ఎప్పుడైనా పత్రికల్లో కథనాలు వస్తే ఒకటి, రెండు వాహనాలను సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే, వాహనాలను సీజ్ చేసినా దందారాయుళ్లు మాత్రం జరిమానా చెల్లించి మట్టి తవ్వకాలు, తరలింపు చేపడుతుండడం గమనార్హం. అడపాదడపా కాకుండా తరచుగా తనిఖీలు చేపడుతూ మట్టి మాఫియాను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇంకొకటి..

- ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లో ఏర్పాటుకు నిర్ణయం
- స్థలాన్వేషణలో నిమగ్నమైన అధికారులు
- త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్న పోలీస్‌శాఖ

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతుండగా ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు భారంగా మారుతోంది. దీంతో ఖమ్మంలో మరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు సుముఖత వ్యక్తం చేసిన రాష్ట్ర పోలీస్ శాఖ త్వరలోనే అనుమతులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

ఒక్క స్టేషన్‌తో ఇక్కట్లు

ఖమ్మంలోని కిన్నెర పాయింట్ వద్ద 25 ఏళ్ల కిందట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. అయితే అప్పట్లో ఉన్న వాహనాల సంఖ్యతో పోలిస్తే ఇప్పుడు పది రెట్లు పెరిగింది. దీంతో సరిపడా సిబ్బంది లేక ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తోడు వీఐపీల రాకపోకల సమయాన మరింత సమస్య ఎదురవుతోంది.

ఎన్నెస్పీ క్యాంప్‌లో మేలు..

జిల్లా అధికారుల ప్రతిపాదన మేరకు రాష్ట్ర పోలీసు శాఖలో రెండో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ముందస్తుగా అధికారులు ఎన్నెస్పీ క్యాంప్‌లో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్వేషణపై దృష్టి సారించారు. సుమారు 500 గజాల నుంచి వెయ్యి గజాల స్థలం కావాల్సి ఉండడంతో గుర్తించగానే ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించనున్నారు. అలాగే, స్టేషన్ భవన నిర్మాణానికి హౌసింగ్ బోర్డు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అయితే, భవన నిర్మాణం జరిగే వరకు అద్దె భవనంలో ట్రాఫిక్ స్టేషన్–2ను ప్రారంభించే అవకాశముంది.

నగరమంతా సెక్టార్లుగా విభజన

కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరైతే నగరాన్ని సెక్టార్లుగా విభజించనున్నారు. తద్వారా ట్రాఫిక్ స్టేషన్–1 పరిధిలోకి వన్‌టౌన్, త్రీటౌన్‌తో పాటు కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ వరకు వస్తుందని తెలిసింది. అలాగే, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్–2 కిందకు టూటౌన్, ఖానాపురం హవేలీతో పాటు అన్ని శివారు ప్రాంతాలకు తీసుకొస్తారని సమాచారం. ప్రస్తుత ట్రాఫిక్ స్టేషన్‌లో 100 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా.. కొత్త స్టేషన్‌కు సైతం అదేస్థాయిలో సిబ్బందిని కేటాయించే అవకాశముంది. ఇక ఏసీపీ స్థాయి అధికారి రెండు స్టేషన్లకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్నాం..



పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ నేతృత్వాన పంపించిన ప్రతిపాదనలకు సుముఖత వ్యక్తమైంది. దీంతో ఎప్పుడైనా ఉత్తర్వులు వచ్చే అవకాశముండడంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఎన్నెస్పీలో అనువైన స్థలాలను పరిశీలిస్తుండగా త్వరలోనే ఓ కొలిక్కి రానుంది. రెండో ట్రాఫిక్ స్టేషన్ ఏర్పాటైతే నగరంలో ట్రాఫిక్ నియంత్రణ సులువవుతుంది. –శ్రీనివాసులు, ట్రాఫిక్ ఏసీపీ

రజతోత్సవ సభకు కదం తొక్కాలి..

సన్నాహక సమావేశంలో ఎంపీ రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన ఎమ్మెల్సీ మధు, సండ్ర, నామ తదితరులు

తిరుమలాయపాలెం: బీఆర్‌ఎస్ రజతోత్సవాల సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎలకతుర్తిలో జరిగే సభకు పాలేరు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం గురువారం తిరుమలాయపాలెంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను విస్మరించడమే కాక ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యాన ప్రజలు బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన మంచిని గుర్తించారని తెలిపారు. రజతోత్సవ సభ తర్వాత బీఆర్‌ఎస్ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తిరుమలాయపాలెం సహా నియోజకవర్గంలో పోలీసులు అత్యుత్సాహంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా తాను ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతంగా ఎవరు వచ్చినా పనులు చేశామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మరికంటి ధనలక్ష్మితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

ఖమ్మంక్రైం: మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పదిహేను రోజుల్లో 15 కేసులు నమోదు చేశామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. వేసవి సెలవుల దృష్ట్యా మైనర్లు వాహనాలు నడపకుండా ప్రతిరోజూ తనిఖీలు చేస్తున్నామని వెల్లడించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వాహనం సీజ్ చేయడమే కాక తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

పెనుబల్లి: ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లిన ఘటన ఇది. మండలంలోని కొత్తకారాయిగూడెంకు చెందిన పాట్రు సత్యంబాబు – రాణి దంపతులు గురువారం సత్తుపల్లికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా కొత్త లంకపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద ఇద్దరు అడ్డగించారు. ఆపై రాణి మెడలోని నాలుగున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పరారయ్యారు. ఘటనపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.వెంకటేశ్ తెలిపారు.

పోషకాహారం, చికిత్సతో క్షయకు చెక్



అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌ఓ, వైద్యులు, ఉద్యోగులు

మధిర: క్షయ బాధితులు పోషకాహారం తీసుకుంటూ సరైన చికిత్స చేయించుకుంటే ఆరోగ్యం మెరుగవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి తెలిపారు. మధిరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఆమె రాజు, కల్యాణి చేయూతతో పౌష్టికాహార కిట్లు అందజేశాక పలు సూచనలు చేశారు. ఆ తర్వాత పీపీ యూనిట్, టీబీ యూనిట్లలో రికార్డులు తనిఖీ చేశారు. వైద్యులు కనకపూడి అనిల్, ప్రేమ్, రామ్మోహన్‌నాయక్, హర్షిత్, అమినాజ్, పృథ్వీరాజ్‌నాయక్, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, లంకా కొండయ్య, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆస్పత్రిలో హీమోఫీలియా వ్యాధిపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో డీఎంహెచ్‌ఓ కళావతిబాయి మాట్లాడారు. మేనరికం వివాహాలతో పిల్లలకు ఈ వ్యాధి సోకుతుండగా, సమస్యలు గుర్తించిన వారు వైద్యులను సంప్రదించాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఊరట

పరిష్కారం కానున్న ఐజీఆర్‌ఎస్ సమస్యలు

ఖమ్మంమయూరిసెంటర్: లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుదారులకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించింది. కానీ ఐజీఆర్‌ఎస్ సమస్యతో ఫీజు చెల్లించలేకపోతున్నట్లు గుర్తించి పరిష్కారంపై దృష్టి సారించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించే క్రమాన ఎదురయ్యే ఐజీఆర్‌ఎస్ సమస్యను సరిదిద్దేలా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకే ఆప్షన్ ఇచ్చారు. ఫలితంగా దరఖాస్తులో మార్కెట్ విలువ, సర్వే నంబర్, ప్లాట్ విస్తీర్ణం, ప్లాట్ నంబర్ వంటివి తప్పుగా నమోదైతే అధికారులు సవరించి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టించుకోనున్నారు. దీంతో ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని ఎక్కువ మంది దరఖాస్తుదారులు వినియోగించుకునేందుకు వీలవతుంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 2వేలకు పైగా దరఖాస్తుదారులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇక నిషేధిత జాబితాలోని ప్లాట్ల సమస్యపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం వెలువరించకపోవడంతో దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. మరోపక్క ఇప్పటికే ఫీజు అందిన దరఖాస్తులకు ప్రొసీడింగ్స్ జారీ చేయడంపై అధికారులు దృష్టి సారించినా, సర్వర్ సమస్యతో ఆలస్యమవుతోందని సమాచారం.

న్యాయమూర్తుల బదిలీలు

ఖమ్మం లీగల్/కొత్తగూడెంటౌన్: ఉమ్మడి జిల్లాలో పలువురు న్యాయమూర్తులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయగా.. వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగూడెం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి.భానుమతి మేడ్చల్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో హైదరాబాద్ ఒకటో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి ఎం.రాజేందర్‌ను నియమించారు. కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.రామారావు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఐదో అదనపు జడ్జిగా బదిలీ కాగా ఆ స్థానంలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఒకటో అదనపు జడ్జి కె.కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఇక హైదరాబాద్ ఎనిమిదో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.కవితను కొత్తగూడెం ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, ఒకటో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా, మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా కుషాయిగూడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి టి.మురళీమోహన్‌ను ఖమ్మం రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా, సికింద్రాబాద్ పదో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి ఎస్.ప్రశాంతిని మధిర సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ఫైనాన్స్ వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం?

మధిర: మైక్రో ఫైనాన్స్ సంస్థ వేధింపులు తాళలేక మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలో గురువారం రాత్రి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మడుపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ గుండగాని గోపి సతీమణి నిర్మల పేరిట మధిర స్పందన ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.60వేల రుణం తీసుకున్నారు. జనవరి నుంచి నెలనెలా రూ.3,500 చొప్పున చెల్లిస్తుండగా, ఈనెల 6న మాత్రం చెల్లించలేకపోయారు. దీంతో గురువారం రాత్రి సంస్థ ఉద్యోగులు మడుపల్లికి వెళ్లి నిర్మలను అసభ్య పదజాలంతో దూషించినట్లు సమాచారం. ఈమేరకు మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంటుండగా స్థానికులు గుర్తించి కాపాడారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి



వృద్ధుడి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే పోలీస్ స్టేషన్ సమీపాన బుధవారం రాత్రి రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు (65) మృతి చెందాడని జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాపర్తినగర్ రైల్వే బ్రిడ్జి సమీపాన ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించినట్లు వివరించారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఫణీందర్

ఖమ్మంక్రైం: ఓ వ్యక్తి అకౌంట్ నుంచి నగదు కాజేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఖమ్మానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.11.49 లక్షల నగదు తనకు తెలియకుండానే విత్‌డ్రా అయ్యాయని మార్చి 22న ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టగా రంగారెడ్డి జిల్లా శంకరపల్లె మండలం కొజ్జగూడెంలో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్న పసులాది మల్లేశ్‌గౌడ్ ఖాతాలో నగదు జమ అయినట్లు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గద్దె రాజుతోపాటు మరికొందరితో కలిసి ఈ నేరానికి పాల్పడినట్లు ఒప్పుకోగా, మల్లేశ్, రాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సైబర్ క్రైమ్ డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ ఫణీందర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐలు జి.రంజిత్‌కుమార్, ఎం.విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు వై.వీ.కృష్ణారావు, టి.కిషన్‌రావు, ఎం.నాగేశ్వరరావును సీపీ సునీల్‌దత్ అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఖమ్మం విజయనగర్‌కాలనీకి చెందిన మురళికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన పూసా నరేందర్ వద్ద మురళి 2013 డిసెంబర్‌లో రూ.7 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ నగదు చెల్లించే క్రమాన 2015 ఫిబ్రవరిలో చెక్కు జారీ చేసినా ఆయన ఖాతాలో నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. దీంతో నరేందర్ లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈ మేరకు విచారణ అనంతరం మురళికి ఆరు నెలల శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.7 లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పుచెప్పారు.

బీటీపీఎస్‌లో సిబ్బంది కొరత

- ఇటీవల మరో 49 మంది కార్మికుల బదిలీ
- రెండు, మూడు పని ప్రదేశాల్లో ఒక్కరికే బాధ్యతలు
- సబ్ ఇంజనీర్లు, కార్మికులపై పెరుగుతున్న పనిభారం

మణుగూరురూరల్: బీటీపీఎస్ (భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్)లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. జెన్‌కో యాజమాన్యం సిబ్బంది నియామకాలపై దృష్టి సారించడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా ఉన్న ఉద్యోగులపై తీవ్ర పనిభారం పెరుగుతోంది. బీటీపీఎస్‌లోని నాలుగు యూనిట్లలో 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. కోల్ ప్లాంట్, యాష్‌ప్లాంట్, ఈఎస్‌పీ (ఎలక్ట్రో స్టాటర్ పెసిఫికేటర్) వంటి ప్రదేశాలు కీలకంగా ఉంటాయి. అలాంటి పని ప్రదేశాల్లోనూ రెండు నుంచి మూడు ప్రదేశాలను ఒక్కరే పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సబ్ ఇంజనీర్లు పర్యవేక్షించాల్సిన పనులు కూడా పనిఒత్తిడితో కిందిస్థాయి కార్మికులతో చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాంట్‌లో సుమారు 1200 నుంచి 1500మంది ఉద్యోగులు అవసరం ఉండగా, ప్రస్తుతం వెయ్యి మంది మాత్రమే పనిచేస్తున్నారు. తాజాగా మరో 49 మంది బదిలీలతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పనిభారమైనా విధులు నిర్వహించాలని హుకుం జారీ చేయడం, చిన్న తప్పిదాలకే బాధ్యులను చేస్తూ మెమోలు జారీ చేస్తుండటంపై ఇటీవల ప్లాంట్‌లో పర్యటించిన సీఎండీకి పలు యూనియన్ల నాయకులు విన్నవించారు.

నియామకాలు చేపట్టకుండా..

నిబంధనల ప్రకారం ఒక్కో పని ప్రదేశంలో కనీసం ఇద్దరు పనిచేయాల్సి ఉంటుంది. ఒకరు అనారోగ్యానికి గురైనా, లేక అవగాహన, అనుభవ లేమి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇద్దరు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా, ఔట్ సోర్సింగ్ ఉపాధి అవకాశాలు పెంచే పరిస్థితులు ఉన్నా యాజమాన్యం పట్టించుకోవడంలేదు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే క్రమంలోనే సిబ్బంది నియామకాలు చేపట్టకుండా, ఉద్యోగులపై పనిభారం పెంచుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా నియామకాలు చేపట్టి ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

పాముకాటుతో వలస కూలీ మృతి

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో వలస కూలీని పాము కాటు వేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గిరిసింగ్ – అదిషో దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి రాగా, మండల కేంద్రంలోని ఇటుకల బట్టీలో పనిచేస్తూ ఇక్కడే నివాసముంటున్నారు. మంగళవారం రాత్రి అదిషో (32) మూత్రవిసర్జన కోసం బయటకు వెళ్లివచ్చాక కాలిపై ఏదో కుట్టినట్లు అనిపించిందని భర్తకు చెబుతూ నిద్రించింది. బుధవారం ఉదయం ఆమె అనారోగ్యానికి గురవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందింది. కాగా, ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లే స్థోమత లేకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు చేయూతతో బల్లేపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మరణంలోనూ అన్నదమ్ముల బంధం



జానీమియా (ఫైల్) మదార్‌సాహెబ్ (ఫైల్)

నేలకొండపల్లి: చిన్నతనం నుంచి కలిసిమెలిసి జీవించిన ఆ అన్నదమ్ముళ్లు ఒకే రోజు మృతి చెందడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. నేలకొండపల్లి మండలం రామచంద్రాపురానికి చెందిన షేక్ జానీమియా (90), మదార్ సాహెబ్ (85) సోదరులు. వీరిద్దరు కొన్నాళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా, గురువారం గంటల వ్యవధిలో మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకోగా, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, గ్రామంలో కబరస్తాన్ సమస్యతో పాటు ఇతర కారణాలతో మదార్‌సాహెబ్ అంత్యక్రియలు బోదులబండలో, జానీమియా అంత్యక్రియలు చెరువుమాధారంలో పూర్తిచేశారు.